ఘన సన్మానం

నస్పూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా కస్తూరి నాగేశ్వర్ ఎన్నికైన సందర్భంగా నస్పూర్‌లోని కలెక్టరేట్ ఏరియా వాకర్స్ హెల్త్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో హెల్త్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు యోగేశ్వర్, వాకర్స్ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, సంపత్ కుమార్, శ్యాంసుందర్, వెంకటేశ్, రమేష్, భాగ్యలక్ష్మి, సాయి తదితరులు పాల్గొన్నారు.

నేడే తొలి విడత పోరు



దండేపల్లి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద సిబ్బంది

దండేపల్లి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలింగ్ సామగ్రితో సిబ్బంది

- పంచాయతీ ఎన్నికలకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్
- అనంతరం ఓట్ల లెక్కింపు
- నాలుగు మండలాల్లో మొత్తం 90 పంచాయతీలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

మంచిర్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తొలి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు గురువారం జరగనున్నాయి. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభం కానుండగా, మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగనుంది. ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ప్రారంభం కానుండగా, అదే రోజు ఫలితాలు వెల్లడించి, విజేతలను ప్రకటించనున్నారు. ఈ మేరకు ఎన్నికల అధికారులు పోలింగ్‌కు అవసరమైన ఏర్పాట్లన్నీ ఇప్పటికే పూర్తి చేశారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రి పోలింగ్ బూత్‌లకు చేరవేయగా, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కుమార్ దీపక్ బుధవారం పరిశీలించారు.

81 గ్రామపంచాయతీల్లో ఎన్నికలు...

తొలి విడత పంచాయతీ ఎన్నికలు మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో జరుగనున్నాయి. నియోజకవర్గంలోని హాజీపూర్, లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాల్లో పంచాయతీ ఎన్నికలు జరుగనుండగా ఆయా మండలాల పరిధిలో మొత్తం 90 సర్పంచ్ స్థానాలు, 816 వార్డు సభ్యుల స్థానాలు ఉన్నాయి. వాటిలో హాజీపూర్ మండలంలో 12 గ్రామ పంచాయతీ (జీపీ)లు ఉండగా, లక్సెట్టిపేట మండలంలో 18 జీపీలు, దండేపల్లి మండలంలో 31 జీపీలు, జన్నారం మండలంలో 29 జీపీలు ఉన్నాయి.

సర్పంచ్ స్థానాలకు సంబంధించి దండేపల్లి మండలంలోని 31 జీపీలకుగాను కొండాపూర్, కొత్త మామిడిపల్లి, పాత మామిడిపల్లి, ముత్యంపేట నాలుగు పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. అలాగే మండలంలోని గూడెం, నెల్కి వెంకటాపూర్ పంచాయతీలు ఎస్టీ సామాజిక వర్గానికి రిజర్వు అయ్యాయి. ఆ గ్రామాల్లో ఎస్టీ ప్రజలు ఎవరూ లేకపోవడంతో సర్పంచ్ స్థానానికి నామినేషన్లు దాఖలు కాలేదు. అలాగే మండలంలోని వందురు గూడను విడగొట్టి కొత్త పంచాయతీగా మార్చడాన్ని నిరసిస్తూ ఆ గ్రామంలో ప్రజలు ఎన్నికలను బహిష్కరించారు. నామినేషన్లు దాఖలు కాకపోవడంతో వందురుగూడలో ఎన్నికలు జరిగే అవకాశమే లేదు. జన్నారం మండలంలోని 29 జీపీలకు గాను లింగయ్యపల్లి, లోత్‌రై పంచాయతీల్లో కేవలం ఒకే ఒక్క నామినేషన్ దాఖలు కావడంతో ఆ రెండింటిని ఎన్నికల అధికారులు ఏక గ్రీవమైనట్లు ప్రకటించారు. తొలి విడతలో మొత్తం తొమ్మిది పంచాయతీల్లో ఎన్నికలు జరగకపోగా, మిగిలిన 81 జీపీల్లో సర్పంచ్ ఎన్నికలు జరుగనున్నాయి.

నాలుగు మండలాల్లో సర్పంచ్ స్థానాలు 81కి గాను మొత్తం 258 మంది పోటీ పడుతున్నారు. అలాగే తొలి విడతలో 816 వార్డు సభ్యుల స్థానాలు ఉండగా, వాటిలో 306 స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 514 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి.

1.28 లక్షల ఓటర్లు...

తొలి విడతలో ఎన్నికలు జరుగనున్న మంచిర్యాల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మొత్తం 1,28,694 మంది ఓటర్లు ఉన్నారు. ఆయా మండలాల్లో మొత్తం 816 వార్డులు ఉండగా, ఒక్కో వార్డుకు ఒక్కో పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారు. తొలి విడత ఎన్నికలు జరిగే మండలాల వారీగా ఓటర్లు ఇలా..

మండలం	మొత్తం	పురుషులు	స్త్రీలు	ఇతరులు
దండేపల్లి	42,101	20,486	21614	01
హాజీపూర్	16,954	8,361	8,593	00
జన్నారం	44,412	21,670	22,740	02
లక్సెట్టిపేట	25,227	12,261	12,966	00

అమలులో 163 బీఎన్‌ఎస్‌ఎస్ యాక్టు..

ఎన్నికలు జరిగే నాలుగు మండలాల పరిధిలో 163 బీఎన్‌ఎస్‌ఎస్ యాక్టు అమలులో ఉండనుంది. ఎన్నికల లెక్కింపు పూర్తికాగానే

మిగతా 7వ పేజీలో





జన్నారం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



లక్సెట్టిపేట డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద సిబ్బంది

పోలింగ్‌కు కట్టుదిట్టమైన బందోబస్తు

- సీపీ అంబర్ కిషోర్ ఝా

మంచిర్యాల క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మొదటి విడత పంచాయతీ పోలింగ్‌కు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, శాంతియుతంగా ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మంచిర్యాల జోన్ పరిధిలో దండేపల్లి, జన్నారం, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాలలో 81 గ్రామ పంచాయతీలు, 514 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరగనున్నాయన్నారు. పోలింగ్, ఎన్నికల ఫలితాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మొదటి విడత ఎన్నికల సందర్భంగా కమిషనరేట్ వ్యాప్తంగా ఇద్దరు డీసీపీలు, ఆరుగురు ఏసీపీలు, 30 మంది సీఐలు, 95 మంది ఎస్సైలు, 270 మంది ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్స్, 520 మంది కానిస్టేబుల్స్, 240 మంది హోంగార్డులు, 170 ఆర్మ్డ్ సిబ్బంది, 72 క్యూఆర్‌టీ టీములు, మిగతా సిబ్బంది 200 కాగా 1600 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు అన్ని భద్రత చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద స్ట్రైకింగ్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులు సిద్ధంగా ఉన్నాయని, పెట్రోలింగ్, మొబైల్ పెట్రోలింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. డబ్బు, మద్యం, బహుమతుల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేసే చర్యలకు పాల్పడడం నిబంధనలకు విరుద్ధమన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పౌరులు తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని సూచించారు.

ఓటర్లకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత



వైద్య సిబ్బందికి ప్రథమ చికిత్స కిట్లు అందజేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత

నెన్నెల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల రోజున పోలింగ్ సెంటర్లలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సిబ్బంది ఓటర్లకు అందుబాటులో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిత సూచించారు. నెన్నెల పీహెచ్‌సీలో బుధవారం ఎలక్షన్ డ్యూటీపై సిబ్బందికి విధులపై అవగాహన కల్పించారు. ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేశారు. డాక్టర్‌తో పాటు సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉదయం ఆరు గంటలకే సెంటర్‌కు చేరుకోవాలన్నారు. మందుల గడువు తేదీలను సరిచూసుకొని తీసుకెళ్లాలన్నారు. ఆర్‌బీఎస్‌కే సిబ్బందితో పాటు వైద్య సిబ్బంది కౌంటింగ్ పూర్తయ్యే వరకు విధిగా సెంటర్‌లోనే ఉండాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్‌ల సేవలను వినియోగించు కోవాలని సూచించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గర్భిణుల నమోదు, టీకాలు వేసే కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేయాలన్నారు. వాతావరణ మార్పులతో వచ్చే వ్యాధులను గుర్తించి చికిత్స అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో సదస్సులు నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంపొందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఇవాంజలీ, డీపీవో ప్రశాంతి, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వెబ్ కాస్టింగ్ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి



వెబ్ కాస్టింగ్ నిర్వహణను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గురువారం జరగనున్న మొదటి విడత పోలింగ్‌లో వెబ్ కాస్టింగ్ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ భవన సముదాయంలో ఏర్పాటు చేసిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వెబ్ కాస్టింగ్ నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడతలో జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో సర్పంచు, వార్డు సభ్యుల స్థానాలకు జరగనున్న పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను సమర్థవంతగా నిర్వహించాలన్నారు. ఈక్రమంలో జిల్లాలో గుర్తించిన 24 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రయ్య, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

పోస్ట్ మెట్రిక్ హాస్టల్ వర్కర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి



వేతనాలు చెల్లించాలని అడిషనల్ డైరెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

నస్పూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్ వర్కర్స్‌కు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో ఎస్సీ డీడీ కమిషనర్ ఆఫీస్‌లో అడిషినల్ డైరెక్టర్ శ్రీధర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర నాయకుడు బ్రహ్మానందం మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా షెడ్యూల్ క్యాస్ట్ డెవలప్‌మెంట్ (ఎస్సీడీడీ) హస్టల్స్‌లో పనిచేసే అవుట్ సోర్సింగ్ వర్కర్స్‌కు 11 నెలలుగా చెల్లింపులేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి వెంటనే వేతనాలు చెల్లించాలన్నారు. వేతనాలు అందకపోవడం వలన కుటుంబ పోషణ భారంగా మారుతుందన్నారు. వర్కర్స్‌కు వేతనాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోస్టుమెట్రిక్ హస్టల్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు సంపత్, రాజన్న, కవిత, లక్ష్మి, శ్యామల, రాజేశ్వరి, శారద, అంజలి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



దండేపల్లి ఎన్నికల పంపిణీ కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

దండేపల్లి డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికలను ఎన్నికల అధికారులు, సిబ్బంది పకడ్బందీగా నిర్వహించేలా కృషిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులకు ఆదేశించారు. దండేపల్లి మండల కేంద్రంలో బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో ఎన్నికల నిర్వహణ కేంద్రాన్ని సందర్శించి ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది ఎన్నికల విధులను విస్మరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు బాధ్యతాయుతంగా ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు. పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చూడాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల మౌలిక వసతులను కల్పించి వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణ కేంద్రం నుంచి ఎన్నికల సిబ్బందికి అన్ని రకాల పోలింగ్ సామగ్రిని అందించాలన్నారు. ఓటర్ల సజావుగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండి ఎన్నికలను ప్రశాంత వాతవరణంలో జరిగేలా చూడాలని సూచించారు. అదనపు కలెక్టర్ చంద్రయ్య, ఆర్డీవో శ్రీనివాస్‌రావు ఎన్నికల నిర్వహణ పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్నికలను సక్రమంగా నిర్వహించేలా చూడాలని పలు అంశాలపై సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో దండేపల్లి మండల ఎన్నికల అధికారి జేఆర్ ప్రసాద్, తహసీల్దార్ రోహత్‌దేశ్‌పాండే, ఎంఈవో మంత్రి రాజు, ఎంపీవో విజయప్రసాద్ శ్రీనివాస్, జోనల్ ఆఫీసర్స్, పీవోలు, ఏపీవోలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

హాజీపూర్: మండలంలో నిర్వహించే ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం హాజీపూర్‌లోని ఎంపీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ పర్యవేక్షించారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఎన్నికలు నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని, ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే ఉపసర్పంచు ఎన్నిక చేపట్టాలన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ చంద్రయ్య ఉన్నారు.

జన్నారం: స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తిస్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంఈవో విజయ్‌కుమార్, ఎంపీడీవో ఉమర్ షరీఫ్ అధికారులు ఉన్నారు.

జాతీయ స్థాయికి ఎంపికైన గురుకుల విద్యార్థి



విద్యార్థిని గౌతమ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

జైపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థి అజ్మీర గౌతమ్ అత్యాపాత్యా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని ప్రిన్సిపల్ కోల నాగేశ్వర్‌రావు, డీసీవో రమాకళ్యాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన గౌతమ్ ఈ నెల 12 నుంచి 14 వరకు పంజాబ్ యూనివర్సిటీ చండీగఢ్‌లో జరిగే 36వ నేషనల్ జూనియర్ బాలుర అత్యాపాత్యా పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థి అజ్మీర గౌతమ్‌ను పీడీ సంతోష్, పీఈటీ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ స్రవంతి, మహిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

హైదరాబాద్‌కే పరిమితమైన ఎమ్మెల్యేలు

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి

తాండూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలోని ముగ్గురు ఎమ్మెల్యేలు సమస్యలను గాలికి ఒదిలేసి హైదరాబాద్‌లో ఉంటున్నారని, వారికి పంచాయతీ ఎన్నికల్లో తగిన బుద్ధిచెప్పాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలో పేరు మీద హామీ ఇచ్చి ప్రజలను మోసం చేసిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు వారికి తగిన బుద్ధి చెప్పబోతున్నారని, బీజేపీ అభ్యర్థులను సర్పంచుగా గెలిపించబోతున్నారన్నారు. బీజేపీతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ముగ్గురు ఎమ్మెల్యేలు వారి అనుచరులు భూములు కబ్జా చేస్తూ అమ్ముకుంటూ ప్రజల సొమ్మును దోచుకుంటున్నారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధిచెప్పాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. అనంతరం అచ్చలాపూర్ గ్రామంలో బీజేపీ బలపరిచిన అభ్యర్థి తరుపున ప్రచారం నిర్వహించారు. సమావేశంలో మండల అధ్యక్షుడు దూడపాక భరత్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, నాయకులు కృష్ణమూర్తి, మహీధర్‌గౌడ్, చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, చిలువేరు శేషగిరి, పులగం తిరుపతి, తిరుపతి, ఈశ్వరి, విగ్నేష్, కుమార్, రాజేశం, ప్రదీప్, నాగభూషణ్ పాల్గొన్నారు.



తాండూర్‌లో మాట్లాడుతున్న రఘునాథ్ వెరబెల్లి

యువతను ప్రోత్సహించాలి

- పెద్దపల్లి ఎంపీ జి వంశీకృష్ణ



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ వంశీకృష్ణ

మందమర్రిటౌన్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి ప్రాంత యువత ప్రతిభావంతులని వారికి స్కిల్‌డెవలప్‌మెంటు అందించి ప్రోత్సహిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని పార్లమెంట్‌లో ఎంపీ జి వంశీకృష్ణ ప్రస్తావించారు. బుధవారం పార్లమెంటు ప్రశ్నోత్తరాల సమయంలో పెద్దపల్లి పార్లమెంటుకు సంబంధించిన పలు ప్రజా సమస్యలను లేవనెత్తారు. ప్రధానంగా రెండు సంవత్సరాల్లో అనేక రైల్వే ప్రాజెక్టులు మంజూరయ్యాయని ఈ నేపథ్యంలో తాజాగా రామగుండం మనుగూరు వద్ద కొత్త రైల్వే లైన్‌కు అనుమతి లభించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు సుమారు 4వేల కోట్లు నిధులు అవసరమని రైల్వేశాఖ కోరినట్లు ఆయన తెలిపారు. కుందన్‌పల్లి ప్రాంతానికి దాదాపు వంద కోట్లు, కుందారం ఫ్లైఓవర్‌తో పాటు మంథని వంతెన నిర్మాణానికి 80కోట్లు నిధులు అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులకు స్పష్టమైన టైమ్‌లైన్‌లు ఏమిటని రైల్వే శాఖను కూడ ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. పెద్దపల్లి ప్రాంతంలో అత్యాధునిక సెమికండక్టర్ స్పెసిలిటి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఐటీ సదుపాయాలను అభివృద్ధి చేస్తే పరిశ్రమల విస్తరణకు, ఉపాధి అవకాశాల పెరుగుదలకు విస్తృతంగా అవకాశాలు ఏర్పడుతాయని తెలిపారు. గతంలో తెలంగాణకు రావాల్సిన సెమికండక్టర్‌ఫ్యాక్టరీ ఆంధ్రప్రదేశ్‌కు తరలిందని తెలిపారు. పెద్దపల్లి ప్రాంత యువత ప్రతిభావంతులని వారికి స్కిల్‌డెవలప్‌మెంటు అందించి సెమికండక్టర్ రంగంలో ఉద్యోగాలు కల్పిస్తే భవిష్యత్ మరింత బలపడుతుందని తెలిపారు. పార్లమెంటు ప్రజలు తనపై ఎంతో నమ్మకం పెట్టుకొని ఎంపీగా ఎన్నుకున్నారని తన పరిధిలోని నియోకవర్గాల అభివృద్ధి ప్రజాసంక్షేమమే తన ఏకైక లక్ష్యమని తెలిపారు.

నిబంధనలు పాటించాలి

వాంకిడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మీ-సేవా కేంద్రాల నిర్వహకులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని ఈ- డిస్ట్రిక్ట్ మేనేజర్ గౌతమ్ అన్నారు. బుధవారం జిల్లాలోని వాంకిడి మండల కేంద్రంలో గల మీ-సేవా కేంద్రాన్ని సందర్శించి రికార్డులు, దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ-డిస్ట్రిక్ట మేనేజర్ మాట్లాడుతూ మీ- సేవా కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. దరఖాస్తులను ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని, ప్రభుత్వ నిర్దేశించిన సేవా రుసుం మాత్రమే తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోస్టు మెట్రిక్ హాస్టల్ వర్కర్లకు గత 11 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం ఎస్‌సీడీ కమిషనర్ కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11 నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కుటుంబ పోషణభారంగా మారిందని అన్నారు. చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్రహ్మానందం, రాజన్న, సంపత్, రాజేశ్వరి, శారద, కవిత, లక్ష్మి, శ్యామల, అంజలి పాల్గొన్నారు.

ఎన్నికల గమ్మత్తు



రెండో విడత ఎన్నికలకు జోరుగా ప్రచారం
గ్రామాల్లో దిగుమతి అవుతున్న మద్యం
14న పోలింగ్‌కు అధికారుల ఏర్పాట్లు

బెజ్జూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పల్లెకు మత్తెక్కుతోంది. జిల్లాలో రెండో విడతలలో ఎన్నికలు జరిగే బెజ్జూరు, దహెగాం, పెంచికలపేట, కౌటాల, సిర్పూర్(టి) మండలాల్లో పోలింగ్ జరిగే పంచాయతీలకు నామినేషన్ల ఉపసంహరణ ముగిసింది. గుర్తులు కేటాయించడంతో ప్రచారం ఊపందుకుంది. 14వ తేదీన ఎన్నికలు కొనసాగనున్నాయి.

ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లోకి భారీగా మద్యాన్ని దిగుమతి చేస్తున్నారు. అన్నా, అక్కా, వదిన, బావ అంటూ వరుసలు కలుపుతూ మాంసం, మందుతో విందు చేసి ఎన్నికల గుర్తులను పరిచయం చేస్తూ అభ్యర్థులు ఓటును అర్జిస్తున్నారు. వార్డుల వారీగా మందు బాటిళ్లను తమ మద్దతుదారులతో ఇళ్లల్లోకి రాత్రి సమయంలో డంపు చేస్తున్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ పడుతున్న అభ్యర్థులు ప్రచారం తొతలిరోజు నుంచే విడివిడిగా మద్యం పంపకాలు సాగిస్తున్నారు. ఏ బ్రాండ్ మద్యం వాడుతారో తెలుసుకొని మరీ సరఫరా చేస్తుండటం విశేషం. పోటీ తీవ్రంగా ఉన్న పంచాయతీల్లో అభ్యర్థులు ఎన్నికల ఖర్చుకు వెనకాడటం లేదు. నువ్వా నేనా అన్నట్లు సాగుతున్న గ్రామాల్లో ఒక్కో సర్పంచ్ అభ్యర్థి 30లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మేజర్, జనరల్ పంచాయతీ స్థానాల్లో ఓటుకు రూ.వెయ్యితో పాటు మహిళలకు చీరెలు, మగవారికి మద్యం సీసాలు పంపిణీ చేస్తున్నారు. కుటుంబంలో ఎన్ని ఓట్లుంటే అన్ని క్వార్టర్ సీసాలు పంచుతున్నారు.

జోరుగా నడుస్తున్న బెల్ట్ షాపులు..

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నా అవి జోరుగా సాగుతూనే ఉన్నాయి. చీప్ లిక్కర్, తక్కువ ధర కలిగిన క్వార్టర్ సీసాలను, బీర్లను అమ్మే బెల్ట్ షాపుల వారు ఎన్నికల సమయంలో అభ్యర్థుల అవసరాలను బట్టి ఆయా రకాల ఖరీదైన బ్రాండ్‌లను, ఫుల్ బాటిళ్లు సైతం విక్రయిస్తున్నారు.

కాగా అభ్యర్థి వెంట గ్రామంలో ప్రచారానికి తిరిగితే రూ. వెయ్యితో పాటు తగినంత మందు పోస్తుండడంతో వ్యవసాయ పనులకు కూలీలు దొరకక ఇబ్బందులు పడుతున్నామని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆయకట్టులో యాసంగి సీజన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పత్తి ఏరివేత, వరి కోతలు తదితర వ్యవసాయ పనులు కొనసాగుతున్న తరుణంలో కూలీల కోసం వెతుకుతుండగా పంచాయతీ ఎన్నికల కారణంగా కూలీలు దొరికే పరిస్థితి కనిపించడం లేదు.



ఎన్నికల్లో ప్రచారానికి వెళ్తే కష్టపడకుండా వెయ్యి రూపాయలు రావడంతో పాటు మత్తెక్కిం చేందుకు కడుపునిండా మందు కూడా పోస్తుండడంతో వ్యవసాయ పనులు నాకా పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. కొందరు కూలీల ను పనులకు వెళ్లడం లేదేంటి అని ప్రశ్నించగా ఇప్పుడు ఓట్ల పండుగ ఉంది కదా వారి వెంట వెళ్తే పైసలు, మందు, తిండి ఉచితంగా దొరుకు తోంది కదా, ఎన్నికలు ఎప్పటికి వస్తాయా అంటూ అందుకే ప్రచారానికి వెళ్తున్నామని చెబుతున్నారు.

ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్


కెరమెరిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

కెరమెరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలంలో గురువారం జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను బుధవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రే పరిశీలిం చారు. పోలింగ్ సిబ్బందికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గురువారం నిర్వహించే సర్పంచ్ ఎన్నికల్లో మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉండగా రెండు పంచాయతీలు ఏకగ్రీం కాగా మాగిలిన 29 స్థానాలకు ఎన్నికలు జరుగనున్నట్లు అధికారులు తెలిపారు. అందుకు గాను 234 పోలింగ్ కేంద్రాలు ఉండగా మొత్తం 400 మంది సిబ్బందిని వినియోగించనున్నారు. ఏని మిది రూట్లుగా విభజించామని చెప్పారు. 250 మంది పోలీసు సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఆయన వెంట అదనపు కలెక్టర దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, ఎంపీడీవో సురేష్‌కుమార్, ఎంపీవో సాయిరాంగౌడ్ ఉన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి

శ్రీరాంపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గనుల్లో భద్రతా ప్రమాణాలు పాటిం చాలని కార్పొరేట్ జీఎం(రక్షణ) కె. సాయిబాబు, శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. బుధవారం వారు ఆర్‌కే 5 గనిని సందర్శించి రక్షణ చర్యలను సమీక్షించారు. ప్రతి ఉద్యోగి వ్యక్తిగత రక్షణ పరికరాలు తప్పనిసరిగా ధరించాలన్నారు. రక్షణ ప్రమాణాలు సంస్థ ప్రగతికి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. గనుల్లో వెంటిలేషన్, సపోర్ట్, డస్ట్ తగ్గించే విధానాలలో ఎలాంటి రాజీ పడవద్దన్నారు. ప్రతి ప్రమాదాన్ని ముందుగానే అంచనా వేసి తక్షణ చర్యలు చేపట్టేలా ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. సురక్షితమైన వాతావరణం, ఉద్యోగుల నిబద్ధత, పర్యవేక్షణ అధికారుల నిరంతర పరిశీలన, మైనింగ్ ప్రమాణాలను ఖచ్చితంగా అనుసరించడం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. శూన్య ప్రమాదాలు లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ శ్రీధర్, గని మేనేజర్ సుధీర్ కుమార్ ఝా, గని రక్షణాధికారి శివయ్య, గని సర్వే అధికారి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

కాసిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కాసిపేట మండల కేంద్రంలోని అక్షర ప్రైవేటు స్కూల్ కరెస్పాండెంట్ ముడిమడుగుల శివకుమార్ కుటుంబాన్ని అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటామని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు దామెర్ల సిద్దయ్య అన్నారు. బుధవారం సోమగూడెంలోని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల నిర్వహణ ఎంతోబాధ్యతతో కూడుకుందని, దీంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై శివకుమార్ గుండెపోటుతో మృతిచెందడం బాధకరమన్నారు. మృతుడి కుటుంబంలోని ఇద్దరు చిన్నారులకు ట్రస్మా ఆధ్వర్యంలో పూర్తి సహకారం అందిస్తామన్నారు. పిల్లల ఉన్నత చ దువుల కోసం అయ్యే ఖర్చునంతా ట్రస్మా ద్వారా అందిస్తామని భరోసా కల్పించారు. అనంతరం ట్రస్మా ఆధ్వర్యంలో జమ చేసిన రూ. 1.75 లక్షలను కుటుంబీకులకు అంద జేశారు. ఈ సందర్భంగా శివకుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారి ఉదారి చంద్రమోహన్‌గౌడ్, రాష్ట్ర నాయకులు రాపోలు విష్ణువర్ధన్‌రావు, మంచిర్యాల పట్టణాధ్యక్షుడు కొమ్ము దుర్గ ప్రసాద్, మందమర్రి మండల అధ్యక్షుడు పెద్దపల్లి ఉప్పలయ్య, కాసిపేట మండల అధ్యక్షుడు సజ్జనపు చంద్రశేఖర్, ఉస్మాన్ పాషా, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


ఆర్థిక సహాయం అందిస్తున్న ట్రస్మా నాయకులు

ఘనంగా అయ్యప్ప పడిపూజ

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాపునగర్‌లో గురుస్వామి బాబురావు ఇంట్లో బుధవారం నిర్వహించిన పడి పూజ ఘనంగా నిర్వహించారు. రెబ్బెనకు చెందిన గురుస్వామి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పదునెట్టంబడిపై దీపాలు వెలిగించారు. అయ్యప్ప స్వాములు పాడిన గీతాలు అలరించాయి. ఎమ్మెల్యే కోవ లక్ష్మి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు మోహన్, శ్రీను, ప్రతాప్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


పడిపూజలో పాల్గొన్న భక్తులు

అధ్వానంగా ఆరోగ్య కేంద్రం

శ్రీరాంపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద ఉన్న ఆరోగ్య కేంద్రం అధ్వానంగా తయారైంది. అత్యంత శుభ్రంగా ఉండాల్సిన కేంద్రం వద్ద పిచ్చిమొక్కలు పెరిగాయి. చెత్తాచెదారం పోగైంది. ఒకవైపు నిర్మించిన మెట్లకు ఉన్న సిమెంట్ ఇటుకలు ఊడిపోతున్నాయి. మెట్ల మొదట్లో ఓ మొక్క పెరిగింది. మెట్లు ఎక్కడం ఎలాగో ఆరోగ్య కేంద్రానికి వచ్చిన వారికి తెలియడం లేదు. పైగా ఆరోగ్యం కేంద్రం బస్టాండ్‌కు సమీపంలో ఉండడంతో రాత్రివేళలో మందు బాబులు కొందరు అక్కడ మద్యం తాగుతూ, సీసాలు, గ్లాసులు పడేస్తున్నారు. మూత్ర విసర్జన చేస్తున్నారు. అధికారులు ఆరోగ్యం కేంద్రం చుట్టూ కాపౌండ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


మెట్ల మధ్యలో పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్త


ఇంటి నుంచి ఓటు లేనట్లే..

- అసెంబ్లీ ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులకు అవకాశం
- పంచాయతీ ఎన్నికల్లో అవకాశం ఇవ్వని ఎన్నికల సంఘం

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల క్రితం జరిగిన ఎమ్మెల్యే, లోక్‌సభ ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులు ఇంటివద్ద నుంచే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. నడవలేని, చేతగాని, మంచానికే పరిమితమైన వృద్ధులు పోలింగ్ కేంద్రానికి వెళ్లలేక పోవడంతో వారు తమ ఓటుహక్కును వినియోగించు కోలేక పోతున్నారు. ఫలితంగా ఓటింగ్ శాతం తగ్గుతుందన్న వాదనలు ఉన్నాయి. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘం అటువంటి వారికి ఇంటినుంచే ఓటు వేసే అవకాశం కల్పించింది. కానీ ప్రస్తుతం జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మాత్రం అలాంటి అవకాశం ఇవ్వలేదు. సర్పంచ్, వార్డు సభ్యులకు ఓటు వేసేందుకు దివ్యాంగులు, వృద్ధులు ఇంటి వద్ద నుంచి ఓటు వేసే అవకాశం కోసం ఎదురు చూస్తున్నా ఎన్నికల సంఘం నుంచి అలాంటి ప్రకటన ఏదీ నేటికి రాలేదు.

గత ఎన్నికల్లో..

గతంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటరు జాబితాలో పేరుండి 85 ఏ ళ్లకు పైబడిన వృద్ధులు, 45 శాతానికి పైగా వైకల్యం ఉన్న వారు ఇంటినుంచే ఓటు హక్కును వినియోగించుకునే వెసులుబాటు కల్పించారు. ఇందుకు ప్రత్యేకంగా 12-డీ ఫారాన్ని ముందస్తుగానే నింపి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. అధికారులు వారు ఇచ్చిన అడ్రస్‌కు పూర్తిస్థాయి భద్రతతో పోలింగ్ సామగ్రితో వెళ్లి ఓటు వేయించారు. ప్రస్తుత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్ద నుంచి ఓటు వేసే అవకాశం లేకపోవడంతో వారు కచ్చితంగా పోలింగ్ కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. పోలింగ్ సమయం కూడా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే ఉంటుంది. నిర్ణీత సమయంలోగా కుటుంబ సభ్యులు వారిని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లి ఓటు వేయించాల్సి ఉంటుంది. కాదు అని వారిని వదిలేస్తే ఓటింగ్ శాతం తగ్గి గెలుపు, ఓటములపై ప్రభావం పడే అవకాశం లేకపోలేదు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులతో పాటు ఓటర్లు సైతం ఇబ్బందులు పడే అవకాశం ఉంది.



సేవా సమితి సేవలు అభినందనీయం


కేక్ కట్ చేస్తున్న జీఎం, సేవా అధ్యక్షురాలు వాణి

మందమర్రిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సేవా సమితి ప్రజాహితం కోసం చేస్తున్న సేవలు అబినందనీయమని మందమర్రి సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు వాణిరాధాక్రిష్ణ తెలిపారు. బుధవారం సేవా సమితి 25వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు పట్టణంలోని సింగరేణి సిమిటార్ లో ఆమె ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ముందుగా కేక్‌కట్ చేసి సేవా సమితి సభ్యులకు తినిపించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా సేవా సమితి సింగరేణి యాజమాన్యం ప్రోత్సహంతో అనేక ఉచిత ఉపాధిశిక్షణ కోర్సులు కార్మిక, కార్మికేతర కుటుంబాల కోసం ప్రవేశపెట్టిందన్నారు. దీనిలో ఉద్యోగుల భార్యలు, వారి పిల్లలు కూడ ఉచిత శిక్షణ పొంది ఆర్థిక అబివృద్ధి సాధించినవారు చాలా మంది ఉన్నారని చెప్పారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ పీవో శంకర్, క్లబ్ సెక్రటరీ మణి, కోశాధికారి కవిత, సభ్యులు రజిత, కోఆర్డినేటర్ నెల్సన్, సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణతో మహిళలకు ఉపాధి

శ్రీరాంపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి సేవా సమితి అందిస్తున్న ఉచిత శిక్షణతో పలువురు మహిళలకు ఉపాధి లభిస్తోందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్, సేవా అధ్యక్షురాలు మునిగంటి ఉమారాణి అన్నారు. సేవా ఆవిర్భావ దినోత్సవం నిర్వహించగా, నూతనంగా వృత్తి శిక్షణను బుధవారం శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలోని సీఈఆర్ క్లబ్‌లో ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, సీనియర్ పీవో సురేందర్, సేవా కార్యదర్శి కొట్టె జ్యోతి, సేవా సభ్యులు, శిక్షకులు, మహిళలు పాల్గొన్నారు.

ఉద్యోగుల భద్రతకు ప్రాధాన్యం

శ్రీరాంపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉద్యోగుల ఆరోగ్యం, భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్, తనిఖీ కమిటీ కన్వీనర్, డిప్యూటీ సీఎంఓ డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. నస్పూర్ డిస్పెన్సరీలో వార్షిక పక్షోత్సవాలను బుధవారం వారు ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగుల ఆరోగ్య రక్షణకు వైద్యులు, వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి సేవలందిస్తున్నారని కొనియాడారు. ప్రతి ఉద్యోగి ఆరోగ్య వివరాలను డిజిటల్ హెల్త్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో నమోదు చేసి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామని అన్నారు. దీంతో ఉద్యోగుల ఆరోగ్య పర్యవేక్షణ, పరీక్షలు, నివేదికలు మరింత పారదర్శకంగా, వేగంగా నిర్వహించడానికి వీలు కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా జీఎం ఉద్యోగులకు ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏరియా రక్షణాధికారి విజయ్ కుమార్, తనిఖీ కమిటీ సభ్యులు హరిశంకర్ రావు, డాక్టర్ శేషగిరి రావు, డాక్టర్ మురళీధర్, డాక్టర్ హంస్సేన్, ఇతర వైద్యులు, వైద్య పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

జైపూర్, (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో బొగ్గు ఉత్పత్తితో పాటు రక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని శ్రీరాంపూర్ జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే ఓసీపీ గనిలో వార్షిక రక్షణ పక్షోత్సవాల కార్యక్రమాన్ని కార్పోరేట్ సేఫ్టీ జనరల్ మేనేజర్ సాయిబాబతో కలిసి ప్రారంభించారు. జీఎం మాట్లాడు తూ జీరో హార్మ్ దిశగా శ్రీరాంపూర్ ఏరియా వెళ్తుందని , ఇందారం ఉపరితల గని ఎలాంటి ప్రమాదాలు లేకుండా ఉందని గుర్తు చేశారు. కంపెనీ వ్యాప్తంగా ఉద్యోగుల రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సింగరేణి సంస్థ 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి దిశగా ముందుకు వెళ్తుందని చెప్పారు. ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించే క్రమంలో రక్షణ సూత్రాలను ఎవరు మరువకూడదని సూచించారు. ఈ సందర్భంగా ఉద్యోగులందరి చేత రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమ్యూనికేషన్ సెల్ కళాకారులు నిర్వ హించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధికారులు లక్ష్మీపతిగౌడ్, రఘుకుమార్, బాజీసైదా, రమణరావు, ఏవీరెడ్డి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం అందజేస్తున్న జీఎం శ్రీనివాస్

ఆన్‌డ్యూటీగా పరిగణించాలి

శ్రీరాంపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో విధులు నిర్వర్తించే సింగరేణి సిబ్బందికి ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పించాలని ఐఎన్‌టీయూసీ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు; హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు వి. అనిల్ రెడ్డి బుధవారం ఒక ప్రకనటలో కోరారు. ఎన్నో వ్యయప్రయాలకు ఓర్చి మారుమూల ప్రాంత గ్రామాలకు వెళ్లి డ్యూటీ నిర్వహిస్తే సింగరేణి ఉద్యోగులకు ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పించడం లేదని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఓడీ ఇచ్చినప్పుడు సింగరేణి సిబ్బందికి ఇవ్వడంలో అభ్యంతరమేంటని ప్రశ్నించారు. సింగరేణి యాజమాన్యం స్పందించి ఎన్నికల్లో విధులు నిర్వర్తించే సిబ్బందికి ఆన్‌డ్యూటీగా పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులు నష్టపోకుండా యాజమాన్యం స్పందించాలని కోరారు.

గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు విఫలం



మాట్లాడుతున్న హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్

మందమర్రిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకుని గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ ఎన్నుకుంటే ఆ సంఘం రెండు సంవత్సరాల కాలంలో సాధించింది శూన్యమని , అదే విధంగా ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ కూడా దారుణంగా విఫలమైందని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ విమర్శించారు. బుధవారం స్థానిక హెచ్‌ఎంఎస్ కార్యాయలంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ రెండు సంఘాలు యాజమాన్యం అనుకూల సంఘాలని, పైరవీలకే పరిమితమయ్యాయని ఆరోపించారు. ఇటీవల కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 40 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా అమలు చేసిందని, దీని వల్ల రానున్న రోజుల్లో సింగరేణి సంస్థకు, ఉద్యోగులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. ఈ కోడ్‌లకు వ్యతిరేకంగా తాము ఆందోళనలు చేస్తున్నామన్నారు. త్వరలోనే తమ యూనియన్ గౌరవాధ్యక్షురా లు కవిత నేతృత్వంలో ఖైరిగూడ నుంచి సత్తుపల్లి వరకు బాయిబాట కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సమావేశంలో తిప్పారపు సారయ్య, పార్వతి రాజిరెడ్డి, శ్రీనివాస్, సుదర్శన్, విజయ్‌కుమార్, భూమన్న తదితరులు పాల్గొన్నారు.

పనిలో నిర్లక్ష్యంగా ఉండొద్దు


సీహెచ్‌పీలో పర్యటిస్తున్న జీఎం విజయభాస్కర్‌రెడి

రెబ్బెన, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ప్రమాదం జరుగకుండా పనిలో నిర్లక్ష్యంగా ఉండొద్దని జీఎం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. గోలేటి సీహెచ్‌పీ ఆవరణలో బుధవారం వార్షిక రక్షణ పక్షోత్సవాల సందర్భంగా తనిఖీ బృందం పర్యటించింది. కార్యక్రమంలో ఏటీఐయూసీ బ్రాంచి కార్యదర్శి తిరుపతి, ఏరియా రక్షణాధికారి రాజమల్లు, హెచ్‌ఓడీ కోటయ్య, రాజు, స్టాలీన్‌బాబు, హనుమాన్‌గౌడ్, సంతోష్‌కుమార్, రాజయ్య పాల్గొన్నారు.

నేడే తొలి విడత పోరు

(5వ పేజీ తరువాయి)

సాయంత్రం ఐదు గంటల నుంచి ఫలితాలు వెలువడే అవకాశం ఉంది. దీంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీస్‌శాఖ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. ఆంక్షల సమయంలో నలుగురికి మించి గుంపులుగా చేరడం, పోలింగ్ బూత్ నుంచి కిలోమీటర్ పరిధిలో కర్రలు, కత్తులు, తదితర మారణా యుధాలతో సంచరించడం నిషేధం. లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేయడం, సభలు, సమావేశాలు నిర్వహించడం కూడా నిషేధించారు.

డిగ్రీ కళాశాలలో అకడమిక్ ఆడిట్

చెన్నూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2022-23,2023-24 సంవత్సరాలకు సంబంధించిన రికార్డులను బుధవారం అకాడమిక్ ఆడిట్ టీం సభ్యులు మంచిర్యాల, ఆసిఫాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాళ్లు కనకయ్య, హరీష్‌కుమార్ పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి తగు సూచనలు చేశారు. కళాశాల ప్రిన్సిపల్ పట్వర్ధన్, అధ్యాపకులు ఉన్నారు.

కళాశాల తనిఖీ

చెన్నూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలనును జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. వార్షిక పరీక్షలకు సిద్ధంగా ఉండాలని, ప్రతి రోజు కళాశాలకు హాజరు కావాలని సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జీ ప్రిన్సిపల్ శ్రీకాంత్ శర్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓటు వేస్తున్నారా..

ఈ నిబంధనలు తప్పనిసరి

నేడు పంచాయతీ తొలి విడత ఎన్నికలు

దండేపల్లి డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి విడత ఎన్నికలు గురువారం 7గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అధికారులు, అభ్యర్థులు, ఓటర్లు, రాజకీయపార్టీలు, పలు నియమాలను పాటించాల్సి ఉంటుంది. పోలింగ్‌ను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జాగ్రత్తలు తీసుకుంటారు. ఇందుకు ఎన్నికల సంఘం పలు నియమాలను అమలు చేస్తుంది. అధికారులు, పార్టీల నాయకులు అభ్యర్థులు విధిగా పాటించాలి.

అభ్యర్థులు, మద్దతుదారులు..

- పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల పరిధిలో ఎక్కడ నాలుగు కంటే ఎక్కువగా గుమికూడడం, చర్చలు నిర్వహించడం వంటి పనులు చేయకూడదు.
- పోలింగ్ కేంద్రాల వద్ద నిర్ణీత దూరం లోపు రాజకీయ పార్టీలు సమావేశం, శిబిరాలు పెట్టవద్దు.
- వంద మీటర్ల దూరం తర్వాత ప్రచార పత్రాలు పంచాల్సి ఉంటుంది.
- అభ్యర్థి పోలింగ్ కేంద్రం ప్రాంగణంలోకి వచ్చి ప్రచారం చేయకూడదు.
- పోలింగ్ స్టేషన్లలో తమకు మద్దతుగా ప్రచారానికి ఉపయోగపడేలా పోస్టర్లు జెండాలు, చిహ్నాలు, గుర్తులు, స్టిక్కర్లు వినియోగించవద్దు.
- పోలింగ్ కేంద్రాల్లో అభ్యర్థులు ప్రచారం, సైగలు ప్రదర్శించడం చేయకూడదు.
- ఎన్నికల కమిషన్ అనుమతి ఉన్న వాహనాలను అభ్యర్థులు వినియోగించాలి.
- విధిగా సంబంధిత అనుమతి పత్రాలను వాహనం ముందు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలి.
- ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవ సభలు నిర్వహించేందుకు పోలీసుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

ఓటర్లు ఏం చేయాలి?

- పోలింగ్ స్టేషన్‌కు విధిగా ఫొటో గుర్తింపు కార్డును వెంట తీసుకెళ్లాలి.
- పోలింగ్ స్టేషన్‌లో ఎంచుకునే అభ్యర్థి సంబంధించి స్వస్తిక్ గుర్తును వేసే ముందు ఆ బ్యాలెట్‌ను ఎలా వాడాలో అధికారును అడిగి తెలుసుకోవచ్చు.
- తమ ఓటు కచ్చితంగా తాము మద్దతు పలికే అభ్యర్థులకు కేటాయించిన బాక్స్‌లో గుర్తుపైన వేయాలి.
- రెండు గుర్తులకు మధ్యలో వేసినా కాగితాన్ని మడవడంతో తేడా ఉంటే చెల్లని ఓటుగా పరిగణిస్తారు.
- ఓటర్ల ఓటు వేయగానే పోలింగ్ బూత్‌ను విడిచి రావాలి.
- తోటి ఓటర్లను ప్రభావితం చేయడం, మాట్లాడడం నిబంధనలకు విరుద్ధం.
- ఓటర్ ఒక్కరే పోలింగ్ బూత్ లోకి వెళ్లాలి.
- నడవలేని వారు, వయోవృద్ధులు, దివ్యాంగులు ఉంటే అక్కడి సిబ్బంది సహాయం తీసుకోవచ్చు.



బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు



మాట్లాడుతున్న రీజినల్ మేనేజర్ బాలచంద్ర పట్కి

నస్పూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామీణ బ్యాంకు సీతారాంపల్లి శాఖ ద్వారా ఖాతాదారులకు మెరుగైనా సేవలందించడంలో ముందుండాలని మంచిర్యాల రీజినల్ మేనేజర్ బాల చంద్ర పట్కి అన్నారు. నస్పూర్ పట్టణంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు సీతారాంపల్లి శాఖ ప్రారంభించి 41 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అధితిగా హాజరైన రీజినల్ మేనేజర్ బాలచంద్ర పట్కి మాట్లాడుతూ బ్యాంకు ద్వారా ఖాతాదారులకు లభ్యమైయ్యే అన్ని ఆర్థిక సేవలను ముందుండి అందించాలన్నారు. వ్యవసాయ రుణాలు, మహిళ సంఘాలకు రుణాలు, ఇంటి నిర్మాణ రుణాలు, వ్యవసాయేతర అవసరాలకు రుణాలు అందిస్తున్నమన్నారు. బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో బ్యాంకు నిర్వహణ అధికారి నరసింహ స్వామి, పలువురు సీనియర్ ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

జిజ్ఞాస ప్రయోగశాల



ప్రయోగం చేసి చూపిస్తున్న జిజ్ఞాస ప్రయోగశాల గైడ్ టీచర్

హాజీపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చందనాపూర్‌లోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో బుధవారం జిజ్ఞాస సంచార ప్రయోగశాల నిర్వహించారు. విద్యాశాఖ నుంచి వచ్చిన వారు నాలుగు నుంచి 8వ తరగతి విద్యార్థులకు సైన్స్‌కు సంబంధించిన ప్రయోగాలు, అవయవాల వినియోగం, స్పైసీమెన్స్ గురించి విద్యార్థులకు వివరించారు. జిజ్ఞాస ప్రయోగశాల గైడ్ టీచర్ లక్ష్మణ్, సంపత్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడి నేత్రదానం



నేత్రాలను అందజేస్తున్న కుటుంబసభ్యులు

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలోని బైపాస్ రోడ్డులో నివాసం ఉంటున్న రిటైర్డు ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎనగండ్ల నారాయణ అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. దీంతో ఆయన కుమారుడు ఎనగండ్ల మహేష్, కుటుంబీకులు నేత్రదానం చే శారు. లయన్ వి మధుసూదన్‌రెడ్డి ఈ మేరకు ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూటషన్ కార్నియా రికవరీ స్పెషలిస్టు ప్రదీప్ సహకారంతో నారాయణ రెండు కళ్ల నుంచి కార్నియాను సేకరించారు. అనంతరం హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు పంపించారు. కుటుంబీకులకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో లయన్ వినయ్‌కుమార్, డాక్టర్లు సుగుణాకర్‌రెడ్డి, అభిషేక్, కిరణ్‌కుమార్, లయన్స్‌క్లబ్ సభ్యులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి విడత పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం..

- పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది
- పోలీసుల భారీ బందోబస్తు



దండేపల్లిలో పోలీసు సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీసీపీ ఎగ్గడి భాస్కర్

లక్షెట్టిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మండలంలో 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి విడతలో ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. స్థానిక బాలికల గురుకులంలో ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయగా సిబ్బంది బుధవారం సామగ్రి తీసుకుని కేటాయించిన కేంద్రాలకు చేరుకున్నారు. రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు మనోహర్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్‌దీపక్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలించి అధికారులకు పలు సలహాలు సూచనలు అందజేశారు.

లక్షెట్టిపేట మండలంలో మొత్తం 18గ్రామ పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. మండలంలో మొత్తం 160 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఒక్కో జీపీకి ఒక పీవోలతో పాటు ఇతర సిబ్బందిని అందుబాటులో ఉంచారు. సుమారు 190మంది ఏపీవో, ఓపీవోలు విధుల్లో ఉన్నట్లు వీరితో పాటు సుమారు 20పీవోలను రిజర్వ్‌గా ఉంచామని ఎంపీడీవో తెలిపారు. ఎలాంటి గొడవలు, అల్లర్లు లేకుండా ఎన్నికలను సామరస్యంగా పూర్తి చేసేందుకు పోలీసులు గట్టి బందోబ్తు ఏర్పాటు చేశారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పర్యవేక్షణలో లక్షెట్టిపేట సీఐ రమణమూర్తితో పాటు మరో ఇద్దరు సీఐలు, ఎస్సై గోపతి సురేష్‌తో పాటు మరో ఆరుగురు అదనంగా ఎస్సైలను కేటాయించారు. సుమారు 200 మంది సిబ్బందితో భద్రత ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో ధర్మారాణి, ఎంపీడీవో సరోజ, తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

దండేపల్లి: మండల పరిధిలోని 24గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు మండల ఎన్నికల అధికారి, ఎంపీడీవో జేఆర్ ప్రసాద్ తెలిపారు. దండేపల్లి మండల కేంద్రంలోని బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల నిర్వహణ కేంద్రంలో ఎన్నికల సామగ్రిని ఆయా పోలింగ్ కేంద్రాల అధికారులు, సిబ్బందికి ఎన్నికల సామగ్రి అందజేశారు. అనంతరం సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. మండలంలోని ఎన్నికల విధులకు 468 పీవోలు, ఏపీవోలను, ఆరుగురు రూట్ ఆఫీసర్లను నియమించినట్లు ఎన్నికల అధికారి ప్రసాద్ తెలిపారు. ఎన్నికల నిర్వహణ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ చంద్రయ్య, ఆర్డీవో శ్రీనివాస్‌రావు సందర్శించి ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలించారు. తహసీల్దార్ రోహత్ దేశ్‌పాండే, ఎంఈవో రాజు, ఎంపీవో విజయప్రసాద్, సిబ్బంది ర్యవేక్షించారు. మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ సందర్శించి పంచాయతీ ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగే విధంగా చూడాలని పోలీసు సిబ్బందికి ఆదేశించారు. ఎన్నికల విధులకు ఒక ఏసీపీ, నలుగురు సీఐలు, ఎనిమిది మంది ఎస్సైలతో పాటు 200 మంది పోలీసులు, 50 మంది ప్రత్యేక సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు లక్షెటిపేట సీఐ రమణమూర్తి, దండేపల్లి ఎస్సై తాహసీనోద్దీన్ వెల్లడించారు.

హాజీపూర్: పంచాయతీ అధికారులు మండలంలో ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశారు. 12 గ్రామపంచాయ తీలకు ఎన్నికలు జరగనుండగా 106 వార్డులకు 22 ఏకగ్రీవం కాగా, మిగిలిన 84 వార్డుల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. మొత్తం 84 పోలింగ్ కేంద్రాల్లో స్టేజ్ 2 అధికారులు 13, ప్రిసైడింగ్ అధికారులు 117, ఇతర అధికారులు 161 మంది, అదనపు సిబ్బందితో కలిపి 300 మందికి విధులను కేటాయించారు. మండలంలో 3 రూట్లను ఏర్పాటు చేసి ముగ్గురు జోనల్ అధికారుల ను నియమించారు. అలాగే బుధవారం ఎంపీపీ కార్యాలయ ఆవరణలో ఎన్నికల సిబ్బంది ఎన్నికల సామగ్రిని అధికారులు అందజేశారు. అనంతరం సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు వాహనాల్లో తరలి వెళ్లారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రశాంత వాతావరణలో ఎన్నికలను జరుపుకోవాలి: డీసీపీ

దండేపల్లి: గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రజలందరు ప్రశాంత వాతావరణలో జరుపుకోవాలని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ సూచించారు. మంగళవారం దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను డీసీపీ సందర్శించి పోలీసు సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై సూచనలు సలహాలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను ప్రతీ ఒకరు పాటించాలన్నారు. ఓటర్లకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాడానికి పోలీసు శాఖ సన్నద్ధంగా ఉందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, సీఐ రమణమూర్తి, ఎస్సై తాహసీనోద్దీన్, సిబ్బంది ఉన్నారు.



దండేపల్లిలో అధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్డీవో శ్రీనివాస్‌రావు



హాజీపూర్‌లో సామగ్రితో పోలీంగ్ కేంద్రాలకు తరులుతున్న సిబ్బంది



లక్షెట్టిపేటలో..

మదర్సా నిర్మాణాన్ని నిలిపివేయాలి



మున్సిపల్ కమషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న హిందూ ఉత్సవ సమితి సభ్యులు

మంచిర్యాల క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలోని లక్ష్మినగర్ రోడ్ నంబర్-5లో ఎలాంటి అనుమతులు లేకుండా హిందువుల నివాసం మధ్యలో మదర్సా నిర్మాణ పనులను చేపట్టడాన్ని నిలిపివేయాలని కాలనీ వాసులతో పాటు హిందూ ఉత్సవ సమితి సభ్యులు మున్సిపల్ కమిషనర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువుల ఇళ్ల మధ్యలో మసీదులు కాని, మదర్సాలు కట్టడం వల్ల భావితరాలకు ఇబ్బందులు కలుగుతాయని అన్నారు. అనుమతి లేకుండా నిర్మించే కట్టడాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవసమితి అధ్యక్షులు డా. రాజ్ కిరణ్, కర్లకంటి రవిందర్, కండె భద్రినారాయణ, శ్రీనివాస్, శ్రీరాం, స్వామి,సుజాత, రాధిక, జ్యోతిక, తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన ర్యాలీ



మందమర్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మందమర్రిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మదర్ థెరిస్సా పాఠశాల విద్యార్థులు బుధవారం మానవ హక్కుల అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ రాష్ట్రీయ రహదారి మీదుగా మంచిర్యాల, మందమర్రి, గోదావరిఖని, బెల్లంపల్లి నాలుగు రోడ్ల కూడలి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా మదర్‌థెరిస్సా ఎడ్యుకేషన్ సొసైటీ సర్వీస్ సెక్యూరిటీ ప్రిన్సిపాల్ భువనేశ్వరి మాట్లాడుతూ మానవ హక్కులపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. రాజ్యాంగం ప్రజలకు అనేక హక్కులను కల్పించిందని, వీటి గురించి ప్రతీఒక్కరు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వహకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూమిని కబ్జా నుంచి కాపాడాలి

భీమిని, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మా భూమిమాకే దక్కే విధంగా చూడాలని చిన్నగుడిపేటకు చెందిన యాటకారి రామయ్య భీమిని తహసీల్దార్‌ను వేడుకున్నాడు. భీమిని మండలంలోని చిన్నగుడిపేట గ్రామ పంచాయతీ శివఆరులోని సర్వే నెంబరు 81/1లో 14 ఎకరాల భూమిని కబ్జా నుంచి కాపాడి మాకే చెందేలా చూడాలని రెవెన్యూ అధికారులను మంగళవారం కోరాడు. చిన్నగుడిపేట శివారులో మొత్తం 81/1లో 16 ఎకరాల భూమి ఉండగా ఇందులో నుంచి రెండెకరాల భూమిని ధోని బాపుకు విక్రయించామన్నారు. బాపు వారసుడు ధోని శ్రీశైలం(శ్రీనివాస్) మిగతా భూమి సైతం తానే హక్కుదారుడని కోర్టులో కేసులు వేశారన్నారు. మాకు తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నాయన్నారు. గతంలో రెవెన్యూ అధికారులు మోకా విచారణ చేపట్టి హద్దులు సైతం నిర్థారించారన్నారు. మా భూమికి సంబధించి ఎలాంటి సాదాబైనామా రాసివ్వలేదన్నారు. మా భూమికి సంబంధించి ఎవరి అప్లికేషన్ వచ్చిన దానిని తిరస్కరించాలని భీమిని తహసీల్దార్ కార్యాలయంలో బాధితుడు వేడుకున్నాడు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా ప్రభుత్వ నిబంధనల మేరకు పట్టాలు చేయడం జరుగుతుందని, పట్టాదారు అనుమతి లేకుండా ఎలాంటి రిజిస్ట్రేషన్ చేయడం జరగదని పేర్కొన్నారు.

డిప్యూటేషన్‌పై విచారణ

భీమారం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భీమారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు పరిమళను డిప్యూటేషన్‌పై బుధవారం జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి సత్యనారాయణ మూర్తి విచారణ చేపట్టారు. అనంతరం విద్యార్థుల ప్రగతి రిజిష్టర్‌లను పరిశీలించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జైపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాన్కూర్, ముదిగుంట, ఇందారం గ్రామ అటవీ ప్రాంతాల్లో పెద్దపులి సంచారం చేస్తున్నందున ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్టు బీట్ ఆఫీసర్ సౌజన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మూడు గ్రామాలకు సంబంధించిన రైతులు, ప్రజలు అటవీ ప్రాంతాల వైపు వెళ్లకూడదని పేర్కొన్నారు. అటవీ ప్రాంతానికి దగ్గరలో ఉన్న పొలాల రైతులు పంటల రక్షణ కోసం విద్యుత్ తీగలు అమర్చరాదని, అటవీ జంతువుల ద్వారా పంట పొలాలకు నష్టం జరిగితే అటవీ శాఖ ద్వారా తగిన నష్టపరిహారం అందుతుందన్నారు. పశువులు కాపర్లకు పెద్దపులి సంచారానికి సంబంధించిన ఆనవాళ్లు కనిపిస్తే అటవీ శాఖ అధికారులకు తెలియజేయాలని సూచించారు.

కోమటిచేనులో తోడికోడళ్ల సవాల్

- దేవాపూర్‌లో మామా అల్లుళ్ల పోటీ



కామెర రాజేశ్వరి, కామెర జ్యోతి

కాసిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న జరిగే రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో కుటుంబ సభ్యులే ప్రత్యర్థులుగా పోటీలోకి దిగడం మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కోమటిచేను గ్రామపంచాయతీలో సర్పంచు అభ్యర్థి స్థానాన్ని జనరల్ మహిళకు కేటాయించారు. దీంతో ఒకే ఇంటి నుంచి ఇద్దరు తోడికోడళ్లు కామెర రాజేశ్వరి, కామెర జ్యోతి సర్పంచు పదవీ కోసం పోటీ పడుతున్నారు. అలాగే దేవాపూర్ మేజర్ గ్రామపంచాయతీ ఎస్టీ జనరల్‌కు కేటాయించారు. ఇక్కడ మామాఅల్లుళ్లు పోటీ పడుతున్నారు. మామ మడావి వెంకటేష్, అల్లుడు పర్చకి ఈశ్వర్ సర్పంచు బరిలో ఉన్నారు. వెంకటేష్ అక్క చంద్రకళ కొడుకు ఈశ్వర్. దీంతో దేవాపూర్‌లో మామా అల్లుళ్ల పోరు చర్చనీయాంశంగా మారింది.

ఎన్నికల నియమావళిపై అభ్యర్థులకు అవగాహన

కోటపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ఎన్నికల నియమావళిపై సర్పంచు అభ్యర్థులకు అధికారులు అవగాహన కల్పించారు. పోటీ చేయనున్న అభ్యర్థుల ఖర్చులు, మోడల్ కోడ్‌పై వివరంగా తెలిపారు. ఎన్నికల నియమావళి తెలిపే పుస్తకాలను అభ్యర్థులకు అందజేశారు. ఖర్చులపై ఎఫ్‌ఎస్‌టీ బృందాల ద్వారా వివరించారు. అభ్యర్థులు ఎన్నికల నియమావళిని అనుసరించాలని ఎన్నికల నిబంధనలు అతిక్రమించరాదని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ రాఘవేందర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

వేమనపల్లి: నీల్వాయి గ్రామంలోని రైతు వేదికలో బుధవారం ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు అధికారులు ఎన్నికల నియామవళిపై అవగాహన కల్పించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, అభ్యర్థుల ఖర్చులు, ప్రచారం తదితర వాటిపై తగు సూచనలు చేశారు. అనంతరం ఎన్నికల నియమావళిని తెలిపే పుస్తకాలను అభ్యర్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుమారస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతీఒక్కరు కృషి చేయాలని ఎంపీడీవో రాజేశ్వర్, తహసీల్దార్ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం సండ్రోన్‌పల్లి రైతు వేదికలో పోటీలో ఉన్న అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నియమాళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలన్నారు. సీఐ శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అందరు పోలీసులకు సహకరించాలన్నారు. సమావేశంలో మందమర్రి, రామకృష్ణపూర్ ఎస్‌ఐలు రాజశేఖర్, రాజశేఖర్, ఎన్నికల ఆడిట్ అధికారి రమేష్, అభ్యర్థులు పాల్గొన్నారు.

ఎన్నికలు సాఫీగా జరిగేలా కృషి చేయాలి

భీమారం: మండలంలోని 11 గ్రామపంచాయతీల్లో ఈ నెల 17న సర్పంచు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికలను సాఫీగా జరగడానికి అధికార యంత్రాంగమంతా కృషి చేయాలని మండల ఎంపీడీవో మధుసూదన్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సిబ్బందికి ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓట్లు వేసేందుకు తగిన వాతావరణం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ సదానందం, జోనల్ అధికారి శ్రీనివాస్, ఎన్నికల సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.



సండ్రోన్‌పల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేశ్వర్

విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగొద్దు

దహెగాం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలని విద్యుత్ శాఖ ఏడీఈ ఇర్ఫాన్ అన్నారు. దహెగాం మండలంలోని దహెగాం, లగ్గాం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం పరిశీలించారు. విద్యుత్ సరఫరాలో ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. సమస్య ఉంటే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట ఏఈ రవీందర్, డీసీఏవో శ్యామూల్, సీఈవో బక్కయ్య, సిబ్బంది జీవన్‌చారి తదితరులు పాల్గొన్నారు.



సర్వం సిద్ధం

వాంకిడిలో ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న సిబ్బంది

- నేడు తొలి విడత పంచాయతీ ఎన్నికలు
- పోలింగ్‌కు అధికార యంత్రాంగం సన్నద్ధం
- ఎన్నికల విధుల్లో 2,341 మంది సిబ్బంది
- ఉదయం 7 గంటల నుంచి ఒంటి గంట వరకు పోలింగ్
- మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి

ఆసిఫాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తొలి విడత పోలిం గ్‌కు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. జిల్లాలో మొదటి విడతగా గురువారం జరిగే పంచాయతీ పోరుకు అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. జిల్లాలో తొలి విడత 114 గ్రామ పంచాయతీ సర్పంచులు, 944 వార్డులు ఉండగా ఇందులో ఇప్పటికే 7 గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల స్థానాలు, 576 వార్డు స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. దీనిలో ఒక్క సర్పంచ్ స్థానానికి, 41 వార్డు స్థానాలకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. దీంతో 106 సర్పంచ్, 327 వార్డు స్థానాలకు పోలింగ్ నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో తొలి విడతగా పంచాయతీ ఎన్నికల్లో 99,844 మంది గ్రామీణ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోను న్నారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఉప సర్పంచ్ ఎన్నికల్లో పారద ర్శకత కోసం వీడియో కవరేజ్ ఏర్పాట్లు చేస్తున్నారు.

● ఐదు మండలాల్లో..

జిల్లాలోని ఆసిఫాబాద్ డివిజన్‌లో గల ఐదు మండలాల్లో మొదటి విడతగా గురువారం ఎన్నిక లు జరిగే 106 గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, 327 వార్డులకు పోలింగ్ నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసిన అధికారులు సజావుగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన పర్యవేక్షణ యంత్రాంగాన్ని సంసిద్ధం చేశారు. పోలింగ్ నిర్వ హణ కోసం మొదటి విడత ఎన్నికల కోసం 2,341 మంది ఎన్నికల సిబ్బందిని వినియోగిస్తున్నారు. వీరిలో 1133 మంది పోలింగ్ అధికారులు, 1208 మంది సహయ పోలింగ్ అధికారులను నియమిం చారు. జిల్లాలో తొలి విడతగా పంచాయతీ ఎన్నికల్లో 99,844 మంది గ్రామీణ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించనున్నారు. తొలి విడత ఎన్నికలు జరిగే ఐదు మండలాలో ఆర్టీసీ బస్సులు, ప్రత్యేక వాహనాలను అధికారులు సిద్ధం చేశారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఆ తరువాత అధికారులు ఫలితాలను వెల్లడించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓటు వేసే సమయం తక్కువగా ఉండడంతో అభ్యర్థులు ప్రతి ఓటును కీలకంగా భావించి గ్రామాల్లో తమదైన శైలిలో ప్రచారం చేపడుతున్నారు.

● 114 పంచాయతీలు..

జిల్లాలో తొలి విడతగా ఎన్నికలు 114 గ్రామ పంచాయతీ సర్పంచులు, 944 వార్డులు ఉండగా ఇందులో ఇప్పటికే 7 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలు,576 వార్డు స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. మరో 41 వార్డు స్థానాలకు,ఒక్క సర్పంచ్ స్థానానికి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. దీంతో 106 సర్పంచ్, 327 వార్డు స్థానాల్లో బరిలో ఉన్నారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని లింగాపూర్‌లో 2 సర్పంచ్,67 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి,అలాగే వాం కిడి మండలంలో ఒక్క సర్పంచ్ స్థానానికి నామినేషన్ దాఖలు కాలేదు. 3 సర్పంచ్,112 వార్డు స్థానాలు ఏకగ్రీవమ య్యాయి. కెరమెరి మండలంలో 2 సర్పంచ్,132 వార్డు స్థానా లు ఏకగ్రీవమయ్యాయి. జైనూర్ మండ లంలో 167, సిర్పూర్-యూలో 98 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. దీం తో 106గ్రామ పంచాయతీ పదవులకు 400 మంది అభ్యర్థులు, 327 వార్డులకు 743 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

ఆయా పంచాయతీల్లో ఓటర్లు ఇలా..

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
జైనూర్	11,936	12,427	00	24,363
కెరమెరి	12,145	11,880	01	24,026
లింగాపూర్	5,103	5,479	01	10,583
సిర్పూర్-యు	5,835	6,440	02	12,277
వాంకిడి	14,458	14,134	03	28,595
మొత్తం	49,477	50,360	07	99,844

● పంచాయతీ ఎన్నికల్లో నోటా..

అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంలకే పరిమితమైన 'నోటా'ను గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రవేశ పెట్టారు. దీంతో బ్యాలెట్ పత్రాలపై అభ్యర్థుల గుర్తుల జాబితాలో చివరణ 'నోటా'ను చేర్చారు. గ్రామ పంచాయతీలో తమకు నచ్చని అభ్యర్థులు ఉన్నట్లయితే ఓటర్లు నోటాపై ఓటు వేసేందుకు వెసులుబా టును కల్పించింది. బరిలో ఉన్న అభ్యర్థులు 'నోటా' గుర్తును బ్యాలెట్ పత్రాల్లో ఉంచడంతో ఒకింత ఆందోళనకు గురవుతు న్నారు. జిల్లాలో తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగే ఐదు మండలాల్లో ఎన్నికల సిబ్బంది, సామాగ్రిని పోలింగ్ బూతులకు తరలించేందుకు 20 ఆర్టీసీ బస్సులతో పాటు 60 కి పైగా ఇతర ప్రైవేటు వాహనాలను ఏర్పాటు చేశారు. ఈ వాహనాల ద్వారా ఎన్నికలు జరిగే జైనూర్, లింగాపూర్, సిర్పూర్(యు,) కెరమెరి,వాంకిడి మం డలాల్లోని ఆయా పోలింగ్ కేంద్రాలకు సామగ్రిని తరలించారు. కాగా తొలి విడత ఎన్నికల విధులకు750 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. తొలి విడత ఎన్నికలు జరుగుతున్న మండలాలో బందోబస్తును ఏస్పీ నితిక పంత్ పర్యవేక్షించారు

● తొలి విడతలో ఇలా..

	పంచాయతీలు	ఏకగ్రీవం	పోటీ	అభ్యర్థులు	వార్డులు	ఏకగ్రీవం	నామినేషన్లు వేయనివి	పోటీ	అభ్యర్థులు
జైనూర్	26	0	26	104	222	167	05	50	109
కెరమెరి	31	02	29	113	250	132	14	104	222
లింగాపూర్	14	02	12	44	112	67	04	41	85
సిర్పూర్-యూ	15	00	15	51	124	98	00	26	56
వాంకిడి	28	03	24	88	236	112	18	106	271
మొత్తం	114	07	106	400	944	576	41	327	743

పల్లె పోరు

సమస్యాత్మక గ్రామాల్లో పటిష్ట నిఘా



జైనూర్‌లో పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ నితికా పంత్

జైనూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల నేపథ్యం లో సమస్యాత్మక గ్రామాల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీ నితికా పంత్ పోలీసులను ఆదేశించారు. స్థానిక విద్యా వనరుల కేంద్రంలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఎస్పీ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికల విధులలో పాల్గొన్న పోలీసు అధికారులతో మాట్లాడారు. పంచాయతీ ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేల కట్టు దిట్టంగా పోలీసు బందో బస్ ఏర్పాటు చేయాలని సూచిం చారు. కార్యక్రమంలో సీఐ రమేష్, ఎస్సై రవి కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని జిలా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ నితికా పంత్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలీస్ బందోబ స్తుతోపాటు భద్రతా చర్యలను ఎస్పీ నితికా పంత్ పర్యవేక్షించారు. విధుల్లో ఉన్న ఆర్ఐ వి ద్యాసాగర్, ఎస్సై రామకృష్ణ, ఇతర పోలీస్ అ ధికారులు, సిబ్బందితో మాట్లాడి ఎన్నికల స మయంలో పాటించాల్సిన భద్రతా చర్యలు, ప్రజా శాంతిభద్రతల పరిరక్షణపై సూచనలు చేశారు.పోలింగ్ కేంద్రాల వద్ద అనుచిత కా ర్యకలాపాలు, గుంపులుగా తిరగడం ప్రలోభా లకు లేదా బెదిరింపులకు తావు లేకుండా క ట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని చెప్పారు. పో లింగ్ కేంద్రాల చుట్టపక్కల నలుగురికి మించి వ్యక్తులు ఉండకుండా సిబ్బంది పర్యవేక్షించా లని ఎస్పీ సూచించారు.

ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక చర్యలు

బెజ్జూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందో బస్తు ఏర్పాటు చేస్తామని కాగజ్‌నగర డీఎస్పీ వహీదుద్దీన్ అన్నారు. బుధవారం మండలంలోని ప్రాణహిత తీర ప్రాంతంలోని సోమిని, మొగవెల్లి, తలాయి తదితర గ్రామా ల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, ప్రాణహిత సరిహద్దు ప్రాంతం కావడంతో ఎప్పటికప్పుడు పటిష్ట భద్రత ఏర్పాటు చేసి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి సంఘట నలు చోటు చేసుకోకుండా గస్తీ నిర్వహించాల న్నారు. ప్రజలు నిర్భయంగా ఓ టు చేయాలని సూచించారు. ఆయన వెంట సీఐ సంతోష్ కుమార్, ఎస్సై సర్తాజ్ పాషా ఉన్నారు.

నేడు సెలవు

ఆసిఫాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెండో సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గురువారం సెలవు ఖరారు చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకటేష్ దోత్రే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా గురువారం మొదటి విడత ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ సంస్థలకు సెలవు ప్రకటించామని తెలిపారు.

జర్నలిస్టులకు ఎన్నికల పాస్‌లు ఇవ్వాలి

ఆసిఫాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఆసిఫాబాద్ జిల్లాలో అక్రిడిటేషన్ కార్డులతో సంబంధం లేకుండా ఎన్నికల పాసులు జారీ చేయాలని బుధవారం కలెక్టర్‌కు టీయూ డబ్ల్యూజే ఐజేయూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజే శారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రహె మాన్, సతీష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలి



పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా

కౌటాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా అన్నారు. కౌటాల, చింతలమానేపల్లి మండలా ల్లోని గుండాయిపేట, గుడ్లబోరి, బాలాజీఅనుకోడ, రన్‌వె ల్లి, బూరెపల్లి గ్రామాల్లో బుధవారం సబ్ కలెక్టర్ పర్యటిం చి పోలింగ్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రా ల్లో వెలుతురు, తాగునీరు, కుర్చీలు ఇతరాత్ర అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. ఆమె వెంట తహసీ ల్దార్ ప్రమోద్‌కుమార్, ఎస్సై చంద్రశేఖర్ ఉన్నారు.

అభ్యర్థులకు అవగాహన

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులకు బుధవారం ఆసిఫాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల ఖర్చులు, అభ్యర్థుల లెక్కలు సమర్పించు విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, అసిస్టెంట్ ఎక్స్పెండీ చర్ అబ్జర్వర్ శంకరయ్య పాల్గొన్నారు.

కేంద్ర నిధులతోనే అభివృద్ధి

దహెగాం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మండలంలోని కోత్మీర్, జెండాగూడ, రాళ్లగూడ గ్రామ పంచాయతీలో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో ముచ్చటించారు. ఎ. ఆయన వెంట నాయకులు శంకర్, తిరుపతిగౌడ్, పురుషోత్తం, శంకర్, సందీప్, శోభన్, సురేష్, మహేష్, సాయికృష్ణ, శంకర్, హరి పాల్గొన్నారు.

ప్రజాసేవ, గ్రామాభివృద్ధే ప్రథమ లక్ష్యం

గుండాయిపేట సర్పంచ్ అభ్యర్థి ఏలేకర్ సంతోష్



ప్రచారం చేస్తున్న గుండాయిపేట సర్పంచ్ అభ్యర్థి ఏలేకర్ సంతోష్

కౌటాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సేవ, గ్రామాభివృద్ధి ప్రథమ లక్ష్యమని గుండాయిపేట గ్రామ సర్పంచ్ అభ్యర్థి ఏలేకర్ సంతోష్ విస్తృత ప్రచారం చేస్తూ దూసుకు పోతున్నారు. కోనేరు కోనపప సంపూర్ణ మద్దతుతో గుండాయిపేట గెలుపుబాటులో ప్రయాణిస్తున్నట్లు గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు. అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని గతంలో ఎంపీటీసీగా గ్రామాభివృద్ధికి తోడ్పడ్డానని ఏలేకర్ సంతోష్ ప్రచారంలో హామిలు ఇస్తున్నారు. గ్రామంలో మంచినీటి సమస్య తీరుస్తూ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తూ గ్రంథాలయం ఏర్పాటుకు కృషి చేస్తానని ప్రజల మన్ననలు పొందుతున్నారు. గతంలో కోనేరు కోనప్ప సహకారంతో గ్రామంలో అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టామని పొలాలు, చేనులకు వెళ్లే రహదారుల నిర్మాణం కూడా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని, ప్రజలు రింగు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ముత్తంపేట గ్రామ సమస్యలు పరిష్కరిస్తా

సర్పంచ్ అభ్యర్థి సరోజ మోరేశ్వర్ డోంగ్రి

కౌటాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎనికల్లో సర్పంచగా తాను గెలిస్తే ముత్తంపేట గ్రామ సమస్యలు పరిష్కరించి గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందు వరుసలో నిలబెడతానని ముత్తంపేట గ్రామ సర్పంచ్ అభ్యర్థి సరోజ మోరేశ్వర్ డోంగ్రి అన్నారు. కౌటాల మండలంలోని ముత్తంపేట గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మద్దతుతో పోటీ చేస్తున్నాని గ్రామంలోని ప్రధాన సమసయలపై దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎన్నికల ప్రచారంలో దూసుకు పోతున్నారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం చేసి నిరుద్యోగుల కోసం లైబ్రరీ ఏర్పాటుకు కృషి చేస్తానని, గ్రామంలో మంచినీటి సమస్య తీరుస్తానని విస్తృత ప్రచారం చేస్తున్నారు. ప్రజలకు సేవ చేసేందుకు ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు ప్రజల అండదండలు తనకు సంపూర్ణంగా ఉన్నట్లు పరచారంలో దూసుకు పోతున్నారు. గ్రామాభివృద్ధి కోసం ఎప్పటికప్పుడు సమావేశాలు ఏర్పాటు చేస్తూ సమస్యలపై చర్చిస్తై ప్రజలకు అండగా ఉంటానని హామీ ఇస్తున్నారు. ఫుట్‌బాల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాని కోరారు.



ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ అభ్యర్థి సరోజ మోరేశ్వర్ డోంగ్రి

కౌటాలను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

సర్పంచ్ అభ్యర్థి నక్క శంకర్



ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ మద్దతు అభ్యర్థి నక్క శంకర్

కౌటాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కౌటాల గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని కౌటాల సర్పంచ్ అభ్యర్థి నక్క శంకర్ విస్తృత ప్రచారం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మద్దతుతో కౌటాలను అభివృద్ధి పథంలో నడిపిస్తానని ప్రచారంలో దూసుకు పోతున్నారు. తాను తెలంగాణ ఉద్యమకారుడినని తెలంగాణ కోసం పోరాడానని కౌటాల ప్రజలు తనకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని అన్నారు. ఉద్యమ కాలంలో తనపై ఎన్నో కేసులు ఉన్నాయని ఇప్పుడు తనకు అవకాశం వచ్చిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని చెప్పారు. గ్రామంలో డ్రైనేజీ సమస్య, దుమ్ము దూళి సమస్య, మంచినీటి సమస్య తీర్చి యువకుల కోసం లైబ్రరీ నిర్మాణం చేపడుతానని పేర్కొంటున్నారు. ప్రజలు తన బ్యాట్ గుర్తుపై ఓటు వేసి అతయధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దంపతులతో కలిసి ప్రచారం నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది



వాంకిడిలో ఎన్నికల సామగ్రి కేంద్రంలో సిబ్బంది సందడి

వాంకిడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలో గురువారం నిర్వహించే మొదటి విడత పంచాయతీ ఎన్నికల నిర్వహ ణకు సిబ్బంది తమకు విధులు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలుతున్నారు. మండలంలోని 28 పంచాయతీలకు గాను 25 పంచాయతీల్లో ఎన్నికలు జరుగనున్నాయని ఎంపీడీఓ జోత్స్న అన్నారు. ఇందులో మూడు పంచాయతీలు ఏకగ్రీవం కాగా మండలంలోని తేజాపూర్ పంచాయతీ ఎస్టీ రిజర్వషన్ రావడంతో అక్కడ ఎస్టీ అభ్యర్థులు లేక సర్పంచుకు ఎన్నికలు జరుగడంలేదు. కేవలం నాలుగు వార్డు సభ్యులకు మాత్రమే ఎన్నికలు జరుగనున్నాయి. దీంతో మండలంలో 25 పంచాయతీల్లో 209 పోలింగ్ కేంద్రా లను ఏర్పాటు చేశారు . మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాంలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 28,595 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించనున్నారు. మండల కేంద్రంనుంచి ఆయా గ్రామపంచాయతీలకు ఎన్నికల విధులకు వెళ్లే సిబ్బందికి వాహనాలు సమకూర్చారు. ఎన్నిక ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ సత్యనారాయణ, ఎస్సై మహెందర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మండలంలో మొదటి విడత గ్రామ పంచాయితీ ఎన్నికలు గురువారం జరగనున్నాయి.మండలంలో మొత్తం 15 గ్రామ పంచాయితీలు సర్పచ్ పదవీ కోసం 51 మంది బరిలో ఉన్నా రు.అదే విధంగా 124 వార్డు సభ్యులకు 98 మంది సభ్యులు ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. అందులో 26 వార్డులకు ఎన్నికలకు 56 మంది వార్డు స భ్యులకు పోటిటీలో ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు గిరిజన క్రీడా పాఠశాల విద్యార్థుల ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోగత నెల 13 నుంచి 16 వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీల్లో ఆసిఫాబాద్ గిరిజన క్రీడా పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి ఈ నెల 13 నుంచి లక్నోలో నిర్వహించే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు లింబారావు, పీడీ మీనారెడ్డి తెలిపారు. శాంతి, చిన్నుబాయి, అఖిల, శరణ్య ఎంపికయ్యారు.

సర్పంచ్ బరిలో తోడికోడళ్లు

బెజ్జూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తోడికోడళ్ల రక్తసంబంధీకుల మధ్య పోరు తారాసాయికి చేరుకుంది. బంధుత్వాలు పక్కన పెట్టి మరీ అభ్యర్థులు ఎవరి సత్తాను వారు చాటేలా సర్వశక్తులు ఒడ్డుతున్నారు. మండలంలోని బారెగూడ గ్రామ పంచాయతీ జనరల్ మహిళకు రిజర్వేషన్ కేటాయించారు. ఈ పంచాయతీలో 1,399 మంది ఓటర్లు ఉన్నారు. బరిలో రేణిగుంట్ల రేఖ(కాంగ్రెస్ మద్దతు దారు), రేణిగుంట్ల ధనలక్ష్మి (బీఆరెస్ మద్దతు దారు) వీరిద్దరు తోడికోడళ్లు బరిలో ఉన్నారు. రేఖ 2014లో ముం జంపల్లి నుంచి ఎంపీటీసీగా గెలుపొంది వైస్ ఎంపీపీగా పని చేశారు. ధనలక్ష్మి భర్త సంతోష్ 2014లో వార్డు సభ్యుడిగా, 2019లో సర్పంచ్‌గా గెలుపొందారు. అయితే ఈ సారి పంచాయతీ ఎన్నికల్లో అన్నదమ్ముళ్ల భార్యలు తోటి కోడళ్లు బరిలో ఉండడంతో ఆసక్తికరంగా మారింది.

మేజర్ పంచాయతీపై దృష్టి

సిర్పూర్(టి), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండ లంలో 16 గ్రామ పంచాయతీలు, 144 వార్డు స్థానాలు ఉన్నాయి. సర్పంచ్ స్థానాల్లో 64 మంది, వార్డు స్థానాలకు 273 మంది బరిలో ఉన్నారు. 16 పంచాయతీల్లో భూపాలపట్నం సర్పంచ్ స్థానానికి ఒకే ఒక నామినేషన్ దాఖలు కావడంతో అక్కడ ఏకగ్రీవంగా అయింది. మిగిలి 15 పంచాయతీలు ఉన్నప్పటికీ ప్రధానంగా సిర్పూర్(టి) మేజర్ గ్రామపంచాయతీలో పోటీ ఆసక్తికరంగా మారింది. ఇక్కడ ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు హోరాహోరీగా పోటీ పడుతున్నారు. ఆయా పార్టీల అభ్యర్థులు తమదైన శైలీలో ఇంటింటికి వెళ్లి తమన గెలిపించాలని వేడ్కోంటున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆరు గ్యారెంటీల పథ కాలు వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తుండగా, బీజేపీ అభ్యర్థి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి కేసీఆర్ హయాంలో అభివృద్ధిని వివరిస్తున్నారు.